క్లుప్తంగా

స్నేహితుడికి ఆర్థికసాయం



వీపనగండ్ల: మండల కేంద్రంలో ఆటో నడుపుకుంటూ అనారోగ్యానికి గురై కాలు కోల్పోయిన ఆటో వీరస్వామికి జోగులాంబ గద్వాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్కూరు శ్రీనివాసులు ఆదివారం రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. 1999–2000 సంవత్సరంలో మండల కేంద్రంలో 10వ తరగతి కలిసి చదువుకున్న వీరస్వామి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడని, అనారోగ్యానికి గురై కాలును కోల్పోవడం సహ విద్యార్థిగా తనను కలిచివేసిందని వాపోయారు. కార్యక్రమంలో వెంకటేష్, శ్రీనివాస్‌రెడ్డి, యువరాజు, బాలరాం, స్నేహితులు విష్ణుష్, సువర్ణ, గోపి, కుర్మయ్య, చిన్నకృష్ణ, మహేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోరుతూ ప్రార్థనలు



ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు ఆదివారం రాత్రి స్థానిక మస్జిదేనూర్‌లో మౌజన్ ఖాజమైనొద్దీన్ ఆధ్వర్యంలో, మస్జిదే సయ్యదియాలో గార్లగుట్ట యూత్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలాన అబ్దుల్‌అలీంరశాది ప్రపంచశాంతి కోరుతు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అమరచింత: పట్టణానికి చెందిన మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తార్‌లో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ హాజరయ్యారు. అనంతరం మౌలానా అల్తాప్ బేగ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, సీఐ శివకుమార్, ఎస్‌ఐ సురేష్, కాంగ్రెస్ నాయకులు పోసిరిగారి విష్ణు, మాజీ ఎంపీటీసీ తిరుమలేష్, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు హనుమంతు నాయక్, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఆత్మకూర్: వేగంగా వచ్చిన కారు, ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయిన ఘటన ఆదివారం ఆత్మకూర్‌లో చోటు చేసుకుంది. అమరచింత మండలం చంద్రగట్టు గ్రామానికి చెందిన నర్సిమయ్య ఆత్మకూర్‌లో జరిగిన సంతలో కూరగాయలు కొని తన ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద ఎదురుగా వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో నర్సిమయ్య తీవ్ర గాయాలయ్యాయి. విషయాన్ని గమనించిన ప్రయాణికులు 108 అంబులెన్సుకు సమాచారం అందించి స్థానిక కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ అజాగ్రత్త వల్లనే ప్రమాదం జరిగిందని, డ్రైవర్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు బాధితుడికి న్యాయం చేయాలని కూరగాయల రఘు తదితరులు డిమాండ్ చేశారు.

'విద్యార్థులను చదివించాలి'



వనపర్తి రూరల్: విద్యార్థులకు ఇంటి వద్ద పనులు చెప్పకుండా బాగా చదివించాలని విద్యార్థుల తల్లిదండ్రులను హెచ్‌ఎం గణేష్‌కుమార్ కోరారు. ఆదివారం మండలంలోని చిట్యాలలో ఉపాధ్యాయులు రవి, షఫీతో కలిసి ఆయన గ్రామంలో తిరుగుతూ పరీక్షలు రాస్తున్న పదో వతరగతి విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి వారిని కలిసి తెలుగు, హిందీ పరీక్షలు ఎలా రాశారు అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సోమవారం జరిగే ఆంగ్లం బాగా చదివి పరీక్ష మంచిగా రాయాలని, ఉపాధ్యాయులు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

వరికి కొంగర తెగులు

పెద్దకొత్తపల్లి: రబీలో రైతులు సాగు చేస్తున్న వరి పైరుకు కొంగర తెగులు ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పంట కంకి దశలో ఉన్నది. కొంగర తెగులు ఆశించి వరిగింజలు పట్టకుండా తెల్లగా కంకులు మారిపోయి రైతులకు బారి నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. మండలంలో రబీలో కేఎల్‌ఐ నీళ్లు రావడంతో 8,144 ఎకరాలలో వరిసాగు చేశారు. రైతులు కొంగర తెగులు నివారణకోసం కాంటాఫ్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు మందును ఎకరాకు పిచికారీ చేసుకుంటే కొంగర తెగులును నివారించుకోవచ్చని పెద్దకొత్తపల్లి ఏఈఓ ముజీబ్ తెలిపారు.

'ఉపాధి'లో సిబ్బంది కొరత

- 17 పంచాయతీలకు 8 మందే ఫీల్డ్ అసిస్టెంట్లు
- నీరుగారుతున్న ప్రభుత్వం లక్ష్యం
- మేటీలతోనే నెట్టుకొస్తున్న వైనం
- కూలి అందక ఇబ్బందులు



పెద్దమారుర్ శివారులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

చిన్నంబావి: గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంతో పాటు వలసలు తగ్గిస్తూ కూలీలకు ఆర్థికంగా చేయూతనందించాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నాయి. కానీ మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో పథకం లక్ష్యం నేరవేరడం లేదు. దీంతో ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనులను వచ్చే కూలీల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతుంది.

వెక్కిరిస్తున్న ఖాళీలు..

మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా.. కేవలం ఎనిమిది మంది ఫీల్డ్ అసిస్టెంట్లు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. కూలీలకు పనులు కల్పించడం, మస్టర్ల కేటాయింపు, పనుల పర్యవేక్షణ, జాబ్ కార్డుల మంజూరు, ఆధార్ అనుసంధానం, కూలీలకు పని ప్రదేశంలో వసతులు కల్పించడం వంటి పనులు ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్వహిస్తారు. మండలంలోని బెక్కెం, పెద్దదగడ, లక్ష్మీపల్లి, వెలగొండ, మియాపూర్, చెల్లపాడు, అమ్మాయిపల్లి, దగడపల్లి గ్రామాల్లో మాత్రమే ఫీల్డ్ అసిస్టెంట్లు పని చేస్తున్నారు. అయ్యవారిపల్లి, కాలురు, వెల్టూరు, గూడెం, గడ్డబస్వాపురం చిన్నంబావి, చిన్నమారు, పెద్దమారు, కొప్పునూరు గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో ఇబ్బందులు కూలీలు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు నలుగురే టెక్నికల్ అసిస్టెంట్లు ఉండటంతో ఉపాధి హామీ పనులు గ్రామాల్లో నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని గ్రామాలకు ఇన్‌చార్జ్ ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించి తూతూమంత్రంగా ఉపాధి పనులను కొనసాగిస్తున్నారు. అంతేకాకేండా అనుభవం ఉన్న సీనియర్ కూలీలను మేట్లుగా గుర్తించి పనులు చేయిస్తున్నారు. కానీ మేట్లు చురుకుగా లేకపోవడంతో గ్రామ కార్యదర్శుల ఉపాధి హామీ పనుల భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా గ్రామ సభలు, నర్సరీల నిర్వహణ, కూలీలకు వేతనాలు మంజూరు వంటి విషయాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడుతోంది. మస్టర్లు రాయడంలో ఇబ్బందులు ఏర్పడుతుండడంతో సరైన సమయంలో కూలీలకు డబ్బులు అందక లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫీల్డ్ అసిస్టెంట్ ఖాళీలను భర్తీ చేయాలని కూలీలు కోరుతున్నారు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తేనే..



మండలంలో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ల వివరాలను ప్రభుత్వానికి, ఉన్నతధికారులకు అందజేశాం. ఉపాధి హామీ పనులకు ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో కొంత ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో పని భారం పంచాయతీ కార్యదర్శి, మేట్లపైనే పడుతోంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే వెంటనే ఖాళీలు భర్తీ చేస్తాం. – రమణరావు, ఎంపీడీఓ, చిన్నంబావి

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మహాసభ పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ఆత్మకూర్: భవన నిర్మాణరంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సంక్షేమ పథకాల రుసుము పెంచాలని టీయూసీఐ జిల్లాకార్యదర్శి రాజు, సహాయ కార్యదర్శి చెన్నయ్య అన్నారు. ఆదివారం మండలంలోని మోట్లంపల్లి గ్రామంలో హెచ్ 74 కార్మిక సంఘం 3వ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్మికులు సంక్షేమ పథకాల కోసం దరకాస్తులు చేసుకొని ఏళ్లుగా గడుస్తున్నా పథకాలు మంజూరు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా కార్మికులకు ఎలాంటి లబ్ధి చేకూరడం లేదని, కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రతిఫలం దక్కడం లేదని వాపోయారు. 60 ఏళ్లు నిండిన కార్మికులకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని, సహజ మరణానికి రూ. 5లక్షలు, ప్రమాద మరణానికి రూ. 10 లక్షలు, ప్రసూతికి రూ. 50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, పేతూరు, రాములు, నాగేష్, చెన్నకేశవులు, కురుకుమూర్తి, కార్మికులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పొట్టేళ్లు మృతి



వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి గొల్ల జంపన్న ఆదివారం ఉదయం తన గొర్రె పొట్టేళ్లను మేతకు తీసుకెళ్తున్న సమయంలో ఎస్సీ కాలనీలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఇచ్చిన ఎర్త్‌కు తగలడంతో మూడు పొట్టేళ్లు అక్కడిక్కడే మృతి చెందాయి. వీటి విలువ రూ.50 వేలు ఉంటుదని గొర్రెల కాపరి గొల్ల జంపన్న తెలిపారు. ప్రభుత్వ పరంగా పరిహారం అందించాలని అధికారులను కోరారు.

గేదే మృతి..

ఆత్మకూర్: విద్యుదాఘాతంతో గేదే మృతి చెందిన ఘటన మండలంలోని ఆరేపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. రైతు అశోక్ తన పశువులను మేత కోసం గ్రామ శివారులోని పుష్కరఘాట్ వద్ద తీసుకెళ్లాడు. అక్కడ రైతులు ఏర్పాటు చేసిన మోటార్ల విద్యుత్ తీగలు తగిలి గేదే విద్యుదాఘాతానికి గురై మృతి చెందిందని వాపోయారు. రూ.60 వేలు నష్టం వాటిల్లిందని రైతు అశోక్ తెలిపాడు. పుష్కరఘాట్ వద్ద అక్రమంగా ఏర్పాటు చేసుకున్న మోటార్లను తొలగించాలని, మరింత ప్రాణనష్టం వాటిల్లకముందే విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మందకృష్ణ కృషితోనే ఎస్సీ వర్గీకరణ



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

కొత్తకోట రూరల్: ఎస్సీ వర్గీకరణకు తాము అనుకూలంగా ఉన్నామంటూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం సైతం సానుకూలంగా ఉండటంతో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మాదిగల ఆత్మగౌరవ నినాదం మందకృష్ణ మాదిగ అని, దళితుల హక్కుల కోసం, ఎస్సీ ఉప వర్గీకరణ కోసం పోరాడిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, ఉమ్మడి జిల్లా సీడీసీ మాజీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, అంబేడ్కర్ సంఘం అధ్యక్షులు ఇజ్రాయిల్, గాడీల ప్రశాంత్, అయ్యన్న, ఆకుల శ్రీనివాసులు, నెహ్రూ, రాజ్‌కుమార్, ప్రశాంత్, కిరణ్, శ్రీకాంత్, వినోద్ తదితరులు ఉన్నారు.

అమరుల ఆశయ సాధనకు కృషిచేద్దాం



జిల్లా కేంద్రంలో కాగడాల ప్రదర్శనలో సీపీఎం నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: స్వాతంత్ర్య పోరాటంలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి అమరులుగా మారిన వారి ఆశయాల కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని డీవైఎఫ్‌ఐ, సీపీఎం నాయకులు అన్నారు. ఆదివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

❐ వనపర్తిలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు ఘనంగా నివాళర్పించారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్, ఇందిరాపార్కు, వివేకానంద చౌరస్తా మీదుగా రాజీవ్‌చౌక్ వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, ఎండీ జబ్బార్, పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి, రాజు, కురుమయ్య, ఉమ, లక్ష్మి, రేణుక, రమేష్, మదన్, బాలస్వామి, గట్టయ్య, మహేష్, మదిలేటి తదితరులు పాల్గొన్నారు.

❐ పాన్‌గల్ మండలంలోని తెల్లరాళ్లపల్లి, తెల్లరాళ్లపల్లితండాలో డీవైఎఫ్‌ఐ, సీపీఎం యువజన సంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యనాయక్, డీవైఎఫ్‌ఐ నాయకులు కృష్ణ, శేఖర్‌యాదవ్, బాలరాజుయాదవ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

❐ ఖిల్లాఘనపురం మండల కేంద్రంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు సామాజిక కార్యకర్త, మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కమ్మరి గోపి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బొట్టు శ్రీను, గాండ్ల నరేందర్, బెస్త భాస్కర్, విజయ్‌కుమార్, రాములు తదితరులు పాల్గొన్నారు.

❐ వీపనగండ్ల మండలంలోని గోపల్‌దిన్నె గ్రామంలో సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శేఖర్‌రెడ్డి, వెంకటయ్య, రాముడు, చంద్రయ్య, కుర్మయ్య, రాంరెడ్డి, శ్రీకాంత్, బాలయ్య, గోపాల్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

❐ జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో రాజ్‌గురు, భగత్ సింగ్, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజారామ్‌ప్రకాశ్, గిరిరాజాచారి, గంధం నాగరాజు, వెంకటేష్, మల్లికార్జున్, రాంబాబు, మురళి, నరసింహ, రంగన్న, సతీష్, హరనాథ్‌రెడ్డి, బాషానాయక్ తదితరులు పాల్గొన్నారు.

❐ అమరచింత పట్టణంలోని భగత్‌సింగ్ విగ్రహానికి సీపీఎం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేష్, అజయ్, ఆర్‌ఎస్ శంకర్, రాఘవ, శ్యాంసుందర్, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో..



తెల్లరాళ్లపల్లిలో..

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



భగవద్గీత గ్రంథాలను ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవాసమితి సభ్యులు

కొత్తకోట రూరల్: ఉగాది పండుగ ప్రత్యేకతపై పరమ పవిత్ర త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించినట్లు త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కొత్తకోట, పెబ్బేరు కమిటీల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని కనిమెట్టలో ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరస్వామి రచించిన 100 ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. ఈ సందర్భగా గ్రామస్తులకు ఉగాది ప్రత్యేక గురించి వివరించారు. ఉగాది అంటే యుగానికి ఆది అని, దేవుడి చేత ఆదివారం సృష్టి ఏర్పడిందని, కాబట్టి మొట్టమొదటి పండుగ యుగాది అని తెలిపారు. పూర్వం ఉగాది రోజు ఆరు గుణాలకు ప్రతీకగా షడ్రుచుల ప్రసాదం తయారుచేసి దైవం వద్ద ఉంచి మోక్షానికి మార్గం చూపాలని వేడుకునే వారని వివరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, పురుషోత్తం, మాసన్న, వేణుగోపాల్, బాలకృష్ణ, శివ, తిరుమలేష్, భాస్కర్‌రెడ్డి, ముజాఫర్‌ఖాన్, అనిత, శాంత, శైలజ, జ్యోతి, శంకరమ్మ, ప్రమీల, మంజుల, లయ ఉన్నారు.

సీపీఐ ఉత్సవాలకు తరలిన కార్యకర్తలు



అమరచింత నుంచి జిల్లా కేంద్రానికి వెళ్తున్న సీపీఐ నాయకులు



పాన్‌గల్ నుంచి..

పాన్‌గల్: జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న సీపీఐ శత జయంతి ఉత్సవాలకు ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్, కాకం బాలస్వామి మాట్లాడుతూ.. సీపీఐ పేదల గుండెల్లో ఉందని, సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుందన్నారు. పాన్‌గల్ మండలంతో పాటు వీపనగండ్ల మండలాల నుంచి శత జయంతి ఉత్సవాలకు భారీ సంఖ్యలో జిల్లా కేంద్రానికి తరలివెళ్లినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వంకగోపాల్, దంగు కుర్మయ్య, పెంటయ్య, పెద్ద హన్మంతు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: జిల్లా కేంద్రంలో నిర్వహించే సీపీఐ వేడుకల్లో పాల్గొనేందుకు మండల కేంద్రం నుంచి సీపీఐ నాయకులు ఎర్రని దుస్తులు ధరించి ఆదివారం తరలివెళ్లారు. భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ రాజీలేని ఉద్యమాలు చేస్తుందని పార్టీ మండల కార్యదర్శి అబ్రహం తెలిపారు. కార్యక్రమంలో భాస్కర్, శ్యాంసుందర్, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి రోడ్డెక్కిన ప్రజలు



అమరచింతలో మరికల్–ఆత్మకూర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రాంనగర్ కాలనీవాసులు

అమరచింత: మున్సిపల్ కేంద్రంలో తాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, తమ వార్డుకు 4 రోజులుగా తాగునీరు అందడం లేదంటూ రాంనగర్ కాలనీకి చెందిన ప్రజలు ఆదివారం రోడెక్కి ఖాళీ బిందెలతో రాస్తారోకో చేపట్టారు. కాలనీవాసులు తాగునీటి కోసం రోడెక్కడంతో ఆయా పార్టీల నాయకులు రాస్తారోకోకు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలం ప్రారంభంలోనే తాగునీటి పరిస్థితి ఇలా ఉంటే ముందు వేసవిలో ఎలా ఉంటుందని ప్రశ్నించారు. పట్టణంలో సోర్స్‌బోర్లు 16 ఉన్నాయని, వాటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తే వార్డులకు నిరంతరం తాగునీరు అందుతుందన్నారు. మిషన్ భగీరథ ద్వార స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నామని చెప్పడమే తప్ప కనీసం ఓవర్‌హెడ్ ట్యాంకులను నింపకుండా నీటిని వృథాగా రోడ్లపై వదిలేస్తున్నారని ధ్వజమెత్తారు. మిషన్ భగీరథ సిబ్బంది ఎప్పుడు నీటిని వదులుతారో అన్న విషయాలు తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. దీనిపై మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇంటి, కుళాయి పన్నులు క్రమం తప్పకుండా వసూలు చేసుకుంటున్నారని, తాగునీరు మాత్రం రోజువారీగా అందించడం లేదన్నారు. వార్డు ఆఫీసర్లు సైతం కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదని అసహనం వ్యక్తం చేశారు. పైప్‌లైన్‌ల లీకేజీ కారణంగా తాగునీటి సరఫరాలో అంతరాయం కలిగిందని, మరోమారు ఇలాంటి ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటామని మిషన్ భగీరథ ఏఈ హర్షవర్ధన్ హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు. ఆటో రాము, లింగమ్మ, ఎనుముల శ్రీను, పుణ్యవతి, మార్కవెంకటేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.


పారిశుద్ధ్యంపై పట్టింపేది?



చెత్తతో నిండిన డ్రెయినేజీ

కొత్తకోట రూరల్: సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తై ఏడాది పూర్తయినప్పటికీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రభుత్వం పాలన కొనసాగిస్తుంది. మండలంలోని కానాయపల్లి శంకరసముద్రంలో ముంపు గ్రామం కావడంతో గ్రామంలో డ్రెయినేజీ తీయకపోవడంతో పాటు పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టడం లేదు. దీంతో గ్రామంలోని ప్రజలు దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతే కాకుండా వేసవి కాలం కావడంతో తాగునీరు సైతం సరిగ్గా సరఫరా కావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు గ్రామాన్ని సందర్శించి గ్రామంలో నెలకొన్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు తొలగేనా?



వెంగళాయిపల్లి సమీపంలో విద్యుత్ స్తంభాలు ఇలా..



కేతేపల్లిలో రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం

పాన్‌గల్: మండలంలోని వెంగళాయిపల్లి, కేతేపల్లి గ్రామాల మీదుగా ఉన్న ఆర్అండ్‌బీ ప్రధాన రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించకపోవడంతో రోడ్డు విస్తరణ పనులు సాఫీగా సాగడం లేదని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలతో ప్రతి నిత్యం ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను త్వరగా తొలగించి రోడ్డు విస్తరణ పనులు సాఫీగా సాగేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్అండ్‌బీ ఏఈ రాకేష్‌ను వివరణ కోసం ప్రయత్నింగా ఆయన అందుబాటులోకి రాలేదు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కోడేరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం కోడేరు మండలం బాడిగదిన్నెలో పర్యటించి సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఒక్కొక్కటిగా నెరవేర్చుతోందని అన్నారు. త్వరలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు అందుతాయన్నారు. ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్త రాంమోహన్‌రావు, మహేశ్వర్‌రెడ్డి, బాలపీరు, అశోక్, కుర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.